క్లుప్తంగా

చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే చర్యలు తప్పవు

సీఐ ఆవుల భాస్కర్



గురజాల : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎవరైనా చట్ట వ్యతిరేకంగా కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోడి పందేలు, జూదం వంటివి నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పందేలు నిర్వహించినా, చూసినా నేరమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నివారించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అల్లర్లు సృష్టించాలని చూస్తే సహించేది లేదన్నారు.

ప్రజావేదిక నిర్వహణ



దాచేపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ప్రజావేదిక సభ శుక్రవారం నిర్వహించారు. డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో 2024లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, భవన నిర్మాణాలపై చర్చించారు. సామాజిక తనిఖీల నివేదికలను గ్రామ పంచాయతీల వారీగా సభలో ప్రవేశపెట్టారు. 2024లో చేపట్టిన రూ.6.54 కోట్ల పనుల్లో రూ.58 వేలు అవినీతి జరిగినట్లుగా తనిఖీల్లో గుర్తించారు. సంబంధిత వ్యక్తుల నుంచి అవినీతి జరిగిన నిధులు రాబట్టాలని పీడీ ఆదేశించారు. ఈ సభలో ఎంపీపీ కందుల జాను, ఎంపీడీవో పప్పుల రత్నం, ఎస్సార్పీ రాజు, ఏపీడీ మల్లిఖార్జునరావు, ఏపీఈ జె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి



దుర్గి: రైతులు, వ్యాపారులు, వినియగదారులకు మెరుగైన సేవలందించడమే తమ బ్యాంకు లక్ష్యమని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దుర్గిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీజీజీ బ్యాంకు, దుర్గి బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మండలంలోని అడిగొప్పల, ముటుకూరు గ్రామాలలో తమ బ్యాంకు సేవలను అందిస్తుందని దుర్గి ప్రజలకు నూతన బ్రాంచి అందుబాటులో తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీఎంలు పి.మారుతిరామ్, పి.వీరారెడ్డి, ఆర్‌ఎంలు ప్రహరాజ, సుభాష్, నరసయ్య, మాజీ సర్పంచి ఎల్లబోయిన గోపాలు, కపలవాయి అప్పారావు, మద్దికర ఆదిరెడ్డి, శ్రీరామ్, కాశిబాబు, కోటేశ్వరరావు, లచ్చయ్య, నాగేశ్వరరావు పలువురు వ్యాపారస్తులు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలి



పిడుగురాళ్ల: పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి కృష్ణనాయక్ మాట్లాడుతూ పట్టణంలోని పేద, నిరుపేదలు ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు. అటువంటి వారిని ప్రభుత్వం గుర్తించి నివేసన స్థలాలు, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సీపీఐ సీనియర్ నాయకులు అక్కినపల్లి బాలయ్య, సీపీఐ నాయకులు, మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు సీపీఐ పోరాటం

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు సీపీఐ పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించకుండా జాప్యం చేస్తే పెద్దెత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సీపీఐ ప్రజా సమస్యలపై పోరాడుతుందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రంగనాయకులు, రెంటచింతల శాఖ కార్యదర్శి మామిళ్ల లాజర్ ఉన్నారు.

విజయం పదిలం

- మార్చి 17 నుంచి పది పరీక్షలు ప్రారంభం
- నియోజకవర్గంలో సిద్ధమవుతున్న 4,210 మంది విద్యార్థులు
- స్వయంకృత తప్పిదాలు చేయవద్దంటున్న ఉపాధ్యాయులు

దాచేపల్లి : పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్‌కి పునాది లాంటింది. పదిలో మంచి మార్కులు సాధించేందుకు చదువుతో పాటు ఆకర్షణీయమైన చేతిరాత, చూడగానే ఆకట్టుకునేలా బొమ్మలు.. గుండ్రటి అక్షరాలు రాయటం ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. విద్యార్థులు సంవత్సరమంతా చదువుకోవటం ఒక ఎత్తయితే.. పరీక్షలు రాయటం మరో ఎత్తు.. పది పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల్లో ఆందోళన సహజంగానే ఉంటుంది. విద్యార్థులు పరీక్షల్లో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే విజయం పదిలంగా ఉంటుంది. మార్చి 17వ తేది నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనుండటంతో విద్యార్థులు ఆందోళన చెందకుండా రాయటం ద్వారా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారు. గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి మండలంలో 943, గురజాల 695, పిడుగురాళ్ల 2,153, మాచవరం 419 కలిపి మొత్తం 4,210 మంది పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు.



దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులు

జాగ్రత్తలు పాటించండి ఇలా

- జవాబు పత్రాలపై తప్పులు చేయవద్దు. గజిబిజిగా.. గందరగోళంగా రాయటం వలన ఆకట్టుకోదు. అలాగే చేతిరాతపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రశ్నపత్రంలో అడిగిన ప్రశ్నలకు జవాబులను సూటిగా, స్పష్టంగా రాయాలి.
- జవాబులు రాసే క్రమంలో అప్రమత్తంగా ఉండాలి. ఒకటికి రెండు సార్లు ప్రశ్నలను చదివి అర్థం చేసుకొని సరైన జవాబు రాయాలి.
- ప్రతి పేజీకి 15 లేదా 16 లైన్లు ఉండేలా చూసుకోవాలి. లైన్లు సమాంతరంగా ఉండాలి.
- గణితంలో అంకెలు స్పష్టంగా రాయాలి. కొట్టివేతలు ఎక్కువగా ఉంటే మార్కులు తగ్గే అవకాశాలు ఉంటాయి. గ్రాఫ్‌ను చక్కగా గీయాలి.
- సైన్స్‌లో బొమ్మలు చక్కగా ఆకర్షణీయంగా గీయాలి. అలాగే చిత్రంలోని భాగాల్ని గుర్తించటంలో క్రమ పద్ధతి పాటించాలి.
- సాంఘికశాస్త్రంలో సమాధానాలను పాయింట్ల వారీగా చక్కగా రాయాలి. మ్యాప్‌లో అడిగిన వాటిని స్పష్టంగా గుర్తించాలి.
- లాంగ్వేజ్ పరీక్షల్లో వ్యాకరణ దోషాలు, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి.



చేతిరాతపై అవగాహన కల్పిస్తున్న రవికుమార్

బొమ్మలు స్పష్టంగా గీయాలి



పది పరీక్షలు రాసే ప్రతి విద్యార్థి అక్షరాలు చక్కగా.. గుండ్రంగా ఉండేలా రాయాలి. జవాబు పత్రంలో పైన కింద మార్జిన్ ఉండేలా చూసుకోవాలి. సైన్స్ బొమ్మలు వేసేటప్పుడు స్పష్టంగా కన్పించేలా గీయాలి. విద్యార్థులు మానసిక ఒత్తిడికి ఎట్టి పరిస్థితుల్లో గురికావొద్దు. అన్ని ఆలోచనలు పక్కనపెట్టి పరీక్షలపైనే దృష్టి పెట్టాలి.

– వంగూరి మేరీ రత్నకుమారి, బయాలజీ టీచర్, దాచేపల్లి

స్వయంకృత తప్పిదాలు చేయవద్దు



పది పరీక్షలు రాసే విద్యార్థులు ముందుగా ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను క్షుణ్నంగా చదివి అర్థం చేసుకోవాలి. మొదటగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి. ఒకదాని జవాబు మరొకదానికి రాసి తప్పులు చేయవద్దు. కొట్టివేతలు ఉండకుండా చూసుకోవాలి. స్వయంకృత తప్పిదాలు చేయవద్దు.

– పాలేటి శ్రీనివాసరావు, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, దాచేపల్లి

పది పరీక్షలకు సిద్ధపడుతున్నాం



పది పరీక్షలు రాసేందుకు సిద్ధపడుతున్నాం. పాఠాలు శ్రద్ధగా విని అర్థం చేసుకుని చదువుకుంటున్నాం. సంవత్సరాంత పరీక్షలకు ముందు పెట్టిన పలు పరీక్షల్లో ఏ సబ్జెక్ట్‌లో వెనుకబడ్డామో తెలుసుకుని దాంట్లో మెరుగుపడేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధిస్తాం.

– కొమ్మా ప్రసన్న, 10వ తరగతి విద్యార్థిని, దాచేపల్లి

చేతిరాత మెరుగుపర్చుకుంటే మంచి ఫలితాలు



పిల్లలను బడికి పంపించే నాటి నుంచే చేతిరాతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. చేతిరాతపై ప్రత్యేక శిక్షణ తీసుకోవటం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చును. ప్రధానంగా పది, ఇంటర్మీడియట్ ఆపై చదువుల పరీక్షల్లో చేతిరాత బాగుంటే మార్కులు బాగా వస్తాయి. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాతో పాటు 10 జిల్లాలకు పైగా చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చాను.

– రవికుమార్, చేతిరాత నిపుణుడు, పిడుగురాళ్ల

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ మండల ఏఈ జి.వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ, ఎల్‌టీ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా 2 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

పిడుగురాళ్లరూరల్: పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి, పాతగణేశునిపాడు, జూలకల్లు, కోనంకి సబ్ స్టేషన్ పరిధిలోపి అన్ని 33 కేవీ, 11 కేవీ లైన్ల మరమ్మతుల దృష్ట్యా రేపు శనివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ వి.లక్ష్మ నాయక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ ఎం.సైదారావు శుక్రవారం తెలిపారు. రెండవ శనివారం పురస్కరించుకొని పట్టణంలోని కొండమోడు, మహవీర్‌నగర్, బైపాస్, జానపాడు సబ్ స్టేసన్ పరిధిలోని 33, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేయనుండటంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

శ్మశానాన్ని కాపాడండి

పిడుగురాళ్ల: పట్టణంలోని మాలల శ్మశాన స్థలంలో మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మాణం సరికాదని మాల మహానాడు నాయకులు శుక్రవారం తెలిపారు. గత 150 సంవత్సరాల నుంచి శ్మశానం ఉందని, అయితే శ్మశాన స్థలంలో ఇప్పుడు మున్సిపల్ అధికారులు మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మించటంతో తమ స్థలం తగ్గుతుందని, పట్టణంలో సుమారు 3 వేల మాలల గృహాలు ఉన్నాయని, ప్రభుత్వం గమనించి మాలల శ్మశానం అన్యాక్రాంతం కాకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైకుంఠ ద్వార దర్శనం.. సర్వ పాప హరణం



మాచర్ల బస్టాండ్ వద్ద వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో డీఎస్పీ జగదీష్

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

మాచర్ల రూరల్: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని పట్టణ, మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, వేంకటేశ్వర స్వామి, వాసవి కన్యక పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. వైకుంఠ ఏకాదశి రోజున విష్ణుమూర్తిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందన్న భక్తుల నమ్మకం. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ సీఐ పచ్చిపాళ్ళ ప్రభాకర్ నేతృత్వంలో ఎస్సై సంధ్యారాణి సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన డీఎస్పీ

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని గురజాల డీఎస్పీ జగదీష్ శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈఓ సాంబయ్య, చైర్మన్ నాగేశ్వరరావు, సుంకె శ్రీనివాసరావులు సాదరంగా స్వాగతం పలకగా అర్చకులు సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయం, కనక దుర్గమ్మ అమ్మవారి దేవాలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శివాలయం, నాగుల గుడి.. ఇలా పట్టణంలోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి

గురజాల/గురజాల రూరల్ : వైకుంఠ ఏకాదశి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయాల్లో స్వామి వార్లు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచే బారులు తీరారు. నగర పంచాయతీ పరిధిలోని సీతారామాలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, జంగమహేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, పల్నాటి వేదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంతో పాటు చర్లగుడిపాడు, పల్లెగుంత, గంగవరం, మాడుగుల, అంబాపురం, పులిపాడు, దైద, గొట్టిముక్కల, తేలుకుట్ల గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామి వార్లను ఉత్తర ద్వార దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



తులసి మాలలతో చెన్నకేశవుడు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

భారీగా చెన్నకేశవుని దర్శించుకున్న భక్తులు

కారెంపూడి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం వేలాదిగా భక్తులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామి వారికి ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు చేతుల మీదగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇచ్చిన తీర్థాన్ని స్వీకరించారు. స్వామి వారితో పాటు బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతానికి కూడా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కొల్లి హనుమంతరావు ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలోని వైష్ణవాలయాల్లో ఆయా గ్రామాల ప్రజలు స్వామి వార్లను ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు.

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో ముక్కోటి ఏకాదశిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక సుబ్బన్నతోట కాలనీ, వేంకటేశ్వర స్వామి మాన్యం కాలనీలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ, శేష భట్టాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి పురస్కరించుకుని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అష్టలక్ష్మీ సమేత విష్ణుమూర్తిని ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. సత్రశాల దేవస్థానంలోని వేంకటేశ్వరస్వామిని ఊసి జెన్‌కో జీఎం శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం చైర్మన్‌లు నాళం పెదబాబు, కట్టమూరి వెంకట నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తుమృకోట గ్రామంలో స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

మాచవరం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరంలోని సీతారామాంజనేయస్వామి దేవాలయం, వేంకటేశ్వరస్వామి దేవాలయం, రామాలయం, మోర్జంపాడులోని బుగ్గ మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని రామాలయం, పిన్నెల్లిలోని సీతారామస్వామి దేవాలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకొని పూజలు చేశారు.



గరుడ వాహనంపై శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి



ఎడుగురాళ్లలోని వేంకటేశ్వరస్వామి



చెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రెంటచింతలలోని వేణుగోపాలస్వామి



మాచవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

వైభవంగా సంక్రాంతి వేడుకలు



హరిదాసుకు బియ్యం వేస్తున్న స్కాలర్స్ టీచర్లు



బహుమతులు అందజేస్తున్న కె పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోటిరెడ్డి, స్కాలర్స్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి



బహుమతులు పొందిన విద్యార్థినులు, కరస్పాండెంట్ రె.ఫాదర్ పీటర్ పాపయ్య



చిన్నారులకు భోగి పండ్లు కార్యక్రమంలో ఉపాధ్యాయులు



విద్యార్థులకు కోడి పందేల విశిష్టతను తెలుపుతున్న ఉపాధ్యాయులు

మాచర్ల రూరల్: సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్తరాలకు తెలిసేలా పలు విద్యా సంస్థలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని వాణి విద్యానికేతన్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. వాణి విద్యానికేతన్ హెచ్‌ఎం రమణ, డైరెక్టర్ అంజలి నేతృత్వంలో పండుగ విశిష్టతను తెలియజేస్తూ చిన్నారులచే రంగవల్లులు, హరిదాసు వేష ధారణలు నిర్వహించారు. ఉపాధ్యాయులు గాలి పటాలు ఎగురవేశారు.

స్కాలర్స్‌లో సంక్రాంతి సంబరాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ముందుగానే వచ్చింది అన్నట్లుగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. ముందుగా పాఠశాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలను వెలిగించి సంబరాలను మొదలుపెట్టారు. విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి షీల్డ్, మెమోటోలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట కె పబ్లిక్ స్కూల్ చైర్మన్ కేసరి కోటిరెడ్డి హాజరై విద్యార్థులకు షీల్డ్, బహుమతలను అందజేశారు. జీవీ రెడ్డి స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.జగదీష్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

రెంటచింతల: తరాలు మారిన మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రె.ఫాదర్ పీటర్ పాపయ్య అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా శుక్రవారం పాఠశాలలో స్థానిక మన గ్రోమోర్ వారు విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా... ఉల్లాసంగా పాల్గొని సంక్రాంతి కళ ఉట్టిపడేలా ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రె. ఫాదర్ పీటర్ పాపయ్య మాట్లాడుతూ సంక్రాంతి పెద్ద పండుగని, సంస్కృతి సంప్రదాయాలను ఎప్పటికీ మరువకూడదని, విద్యార్థినులు ముగ్గులు వేసి ప్రతిభను చాటుకోవడం అభినందనీయమన్నారు. కోరమండల్ ఏరియా మేనేజర్ ప్రవీణ్, పిడుగురాళ్ల మార్కెంటింగ్ మేనేజర్ జాకీర్ హుస్సేన్, రెంటచింతల మన గ్రోమోర్ మేనేజర్ గోపి, సైదానాయక్ విజేతలకు బహుమతులను అందజేశారు.

బోధి సీబీఎస్ఈ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

పిడుగురాళ్లరూరల్: మండలంలోని తుమ్మలచెరువు గ్రామ బోధి సీబీఎస్ఈ పాఠశాలలో సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

పాఠశాలలో భోగి మంటలు, గొబ్బెమ్మలు, హరిదాసు పాటలు, పంతగులు, చిన్నారులకు భోగి పండ్లు పోయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికుల రాష్ట్ర పిలుపు మేరకు పిడుగురాళ్ల పట్టణంలోని ఐలాండ్ సెంటర్ వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే దీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 16 రోజుల పాటు సమ్మె సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన బెనిఫిట్స్‌ను వెంటనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, చనిపోయిన కార్మికులకు పరిహారం రూ.2 లక్షలకు పెంచాలని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రతాప్, రామారావు, నాగేశ్వరరావు, మార్తమ్మ, చిన్న వీరమ్మ, కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, శ్రీను, రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి



మాచర్ల రూరల్: ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తూ నిరుపేదలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం మెడలు వంచే వరకు సీపీఐ పార్టీ పేదల పక్షాన పోరాటం చేస్తుందని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు, టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి ఇస్తామని చెప్పి నేటికి ఏడు నెలలు దాటుతున్నా కార్యాచరణ చేపట్టకపోవటం దారుణమన్నారు. పట్టణాలలో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు ఇస్తామన్న హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమలలో జరిగిన తొక్కిసలాటకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.